

ఇందిరమ్మ ఇళ్ల సర్వే సిబ్బందితో సమావేశమైన కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

అసలైన లబ్ధిదారులను గుర్తించండి

యూసు్ఫగూడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే సమగ్రంగా నిర్వహించాలని, అసలైన లబ్ధిదారులను గుర్తించాలని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. బుధవారం ఇందిరమ్మ సర్వే సిబ్బంది ఎస్ఎఫ్ఏలు, ఆర్‌లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను ప్రతి బస్తీలో సమగ్రంగా సర్వే నిర్వహించాలన్నారు. ఇళ్లలేక ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలను గుర్తించి వారికి లబ్ధి చేకూరేలా సమగ్రంగా సర్వే చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం

ఎర్రగడ్డ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నీలిమా ఆస్పత్రిలో గురువారం గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. బుధవారం ఆస్పత్రిలో ఎండీ నీలిమా శ్రీనివాస్ మాట్లాడుతూ నిరుపేద గర్భిణులకు చేయూతను అందించటానికి 'నీలిమా9' పేరుతో ప్రతి నెల 9వ తేదీ ఆస్పత్రిలో గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఉచిత వైద్య శిబిరంలో పేరు నమోదు చేసుకున్న గర్భిణులకు ఉచితంగా మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య

ఇళ్ల సర్వేలో డబ్బులు అడిగితే మా దృష్టికి తీసుకురావాలి

● డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య

బేగంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య అన్నారు. బుధవారం బేగంపేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ఇళ్లకు వెళ్లి సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్‌లో ఇందిరమ్మ ఇళ్లకోసం మొత్తం 26,049 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు 14,300 ఇళ్ల సర్వే పూర్తయిందన్నారు. ప్రతి ఒక్క ఇంటికి వచ్చి సిబ్బంది సర్వే చేస్తున్నారన్నారు. ఇళ్ల సర్వేకు వచ్చిన వారు ఎవరైనా డబ్బులు అడిగితే మా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



బేగంపేట ఫ్లైఓవర్ క్రింద ఉన్న చిరు వ్యాపారులను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్యతో కాంగ్రెస్ నేత అడపా అభిషేక్

చిరు వ్యాపారాలను తొలగించం

● ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య

బేగంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా వ్యాపారులు చేసుకోవాలని బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య అన్నారు. బేగంపేట ఫ్లైఓవర్ క్రింద ఉన్న చిరు వ్యాపారాలు తొలగించాలని ట్రాఫిక్ పోలీసులు చెప్పడంతో స్థానికులు విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలిమ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె ఆదేశాల మేరకు ట్రాఫిక్ అధికారులతో కలిసి కాంగ్రెస్ నేత అడపా అభిషేక్ ఈ ప్రాంతంలో పర్యటించి వారికి బరోసా ఇచ్చారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్యతో కలిసి చిరు వ్యాపారులను కలిసి మాట్లాడారు. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా, రోడ్డుపైకి రాకుండా వ్యాపారాలు చేసుకోవాలని, రోడ్డుపై వేసిన రేకులను తొలగించాలని చిరు వ్యాపారులకు సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేని వాటిని తొలగించబోమని ఈ సందర్భంగా వారికి తెలిపారు. కాంగ్రెస్ నేత అడపా అభిషేక్ మాట్లాడుతూ పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బస్తీలో ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారాలను తొలగించవద్దని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌ను కోరగా ఆయన అందుకు సానుకూలంగా స్పందించారన్నారు. కాంగ్రెస్ నేతలు మునీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పదోన్నతులను సమీక్షించాలి

● విద్యుత్ బీసీ ఉద్యోగుల మహాసభ డిమాండ్

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో అక్రమ పదోన్నతులను సమీక్షించాలని విద్యుత్ బీసీ ఉద్యోగుల మహాసభ డిమాండ్ చేసింది. విద్యుత్ సంస్థల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో బుధవారం ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సంస్థల్లో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులతో 19వ రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభలో సంఘం నేతలు పలు డిమాండ్లను తీర్మానించింది. రాష్ట్ర అధ్యక్షుడు కోడెపాక కుమారస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్నగౌడ్‌లు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యాజమాన్యాలు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉద్యోగుల కేటాయింపులకు సంబంధించి సుప్రీంకోర్టు ధిక్కరణ కేసును సాకుగా చూపి 2022లో వందలాది మంది ఉద్యోగులకు షరతులతో కూడిన పదోన్నతులు కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పదోన్నతులను సమీక్షించి నష్టపోయిన బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

వృత్తి కులాలపై అక్రమ కేసులు

● గౌడ మహనీయుల క్యాలెండర్ ఆవిష్కరణ

.పంజాగుట్ట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వృత్తి కులాలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్ అధ్యక్షతన బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమితి క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పరిశ్రమలు లేనప్పుడే ఉన్న ఏకైక పరిశ్రమ కల్లు గీత పరిశ్రమ అన్నారు.రాష్ట్రంలో సుమారు 13 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అయితే 56 లక్షల లీటర్ల పాల విక్రయాలు జరుగుతున్నాయని, పాలకులు రాష్ట్రంలో కోట్ల మంది తాగే పాలపై దృష్టి పెట్టకుండా, సుమారు 25 నుంచి 30 లక్షల మంది తాగే కల్లుపై దృష్టి పెట్టి గౌడ సామాజిక వర్గంపై కేసులు పెట్టడమే కాకుండా పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపుతున్నారని అన్నారు. గౌడ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్. శ్రీకాంత్ గౌడ్ అన్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యురాలు బాల లక్ష్మి, పల్లె రవి కుమార్, బాలరాజ్ గౌడ్, ఐలి వెంకన్న గౌడ్, బండి సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి శ్రీనగర్ కాలనీ వేంకటేశ్వర ఆలయం ముస్తాబు

బంజారాహిల్స్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఏడు కొండల వాడ... ఆపదమొక్కుల వాడ అనాథ రక్షక గోవిందా.. గోవిందా అంటే చాలు భక్తులకు నేనున్నాంటూ అభయం ఇస్తాడు శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వరుడు. ఇక్కడ నిత్యం ప్రత్యేక పూజలతో స్వామి నిత్యం కల్యాణం పచ్చతోరణంలా విరాజిల్లుతాడు. ముక్కోటి ఏకాదశి కోసం ముస్తాభవుతుంది. ఈనెల 10 నుంచి జరగబోయే వైకుంఠ ఏకాదశి వేడుకల కోసం ఆలయంలో ఏర్పాట్లు ఊపందుకున్నాయి.



ఆలయ గోపురం

ప్రత్యేక ఏర్పాట్లు...

వైకుంఠ ఏకాదశి రోజున సుమారు లక్ష మందికి పైగా భక్తులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వస్తుంటారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ దీపాలు, పూల అలంకరణతో ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. మెయిన్ రోడ్డు నుంచి ప్రత్యేకంగా క్యూ లైన్‌లు ఏర్పాటు చేశారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక పూజలకు హాజరుకానున్నడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ఉదయం నుంచే పూజలు

ఆలయంలో ఉదయం 2.30 గంటలకు శ్రీవారికి ప్రత్యేక సుప్రభాత సేవ, అభిషేకం. ఇందుకోసం 300 మంది భక్తులను మాత్రమే అనుమతిస్తారు. టికెట్ తీసుకున్న వారికే సదుపాయం కల్పించారు. సేవలు పూర్తయిన తరువాత గరుడ వాహనుడిపై ఉన్న శ్రీవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ ప్రాంగణంలో ఊరేగించి ఉత్తర ద్వారం గుండా లోపలికి తీసుకువెళ్లిన అనంతరం సామాన్య భక్తులకు దర్శన అవకాశం కల్పిస్తారు.

ప్రత్యేక సదుపాయాలు



భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. క్యూ లైన్ దగ్గరి నుంచి, మంచినీటి వసతి, ప్రసాదం ఇలా ప్రతి విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని ఏర్పాట్లు చేస్తున్నాం. త్వరగా దర్శనం కావాలనుకునే వారికోసం శీఘ్ర దర్శనం కల్పిస్తున్నాం. సామాన్యులకు అడ్డంకి లేకుండా ప్రత్యేక దర్శనాలు జరుగుతాయి.

-శ్రీనివాస్ శర్మ, ఈవో

వైద్య సేవల్లో అనేక సంస్కరణలు

● అమీర్‌పేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మరో 50 పడకలు ● 24 గంటల విద్యుత్ సరఫరా
● జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

అమీర్‌పేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మరో 50 పడకలను ఏర్పాటు చేసేందుకు దృష్టిసారించామని, ఇందుకు గాను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిష్టియనను కలిసి విజ్ఞప్తి చేయనున్నట్లు రాష్ట్ర రవాణా, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. బుధవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వివిధ శాఖల అధికారులతో కలిసి అమీర్‌పేటలోని జనరల్ ఆస్పత్రిని సందర్శించిన మంత్రి ప్రభాకర్ ఇందులో ఉన్న డాక్టర్లు, రోగులు, రోగుల బంధువులతో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి ప్రతి రోజూ వస్తున్న ఓపీలు, ఎన్ని ఎమర్జెన్సీ కేసులు, ప్రతి నెలలో జరుగుతున్న ప్రసవాలు, తదితర వాటి గురించి సుపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గైనకాలజీ విభాగం పరిశీలించి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు విశ్వాసం కల్పించేలా పని చేయాలని వైద్యులకు సూచించారు. మందుల కొరత ఉందా అని తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పనిచేసే శానిటేషన్ సిబ్బందికి 5 నెలలుగా జీతాలు రావడం లేదని మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే చెల్లించాలని ఆదేశించారు. ముఖ్యంగా ఇప్పుడున్న 50 పడకలకు అదనంగా మరో 50 పడకలు కావాలని ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఎస్‌డీఎఫ్ నిధులతో ఆస్పత్రిలో లిఫ్ట్ ఏర్పాటు చేయిస్తానని, 108 అంబులెన్స్‌ను ఆసుపత్రికి కేటాయించేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలోఆర్ఎంవో వినాయక్ రావు, సుపరిండెంట్ రాహుఫ్, డాక్టర్ దశరత్ పాల్గొన్నారు. జాతీయ రహదారుల భద్రత మాసోత్సవాలో భాగంగా ఎస్ఆర్‌నగర్‌లోని ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లను పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ చౌరస్తాలో డిజిటల్ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు, జీబ్రా క్రాసింగ్ క్లియర్‌గా కనిపించేలా మార్పు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జేటీసీ రమేష్, ఏసీపీలు వెంకటరమణ, కట్టా హరిప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో శిశువులను పలకరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

విద్యుత్ చార్జీల టారిఫ్ మార్పుపై హర్షం

● సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు పెద్ద ఊరట

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆఫ్‌సెట్ ప్రింటింగ్ ప్రెస్‌ల ఎలక్ట్రిసిటీ టారిఫ్‌ను కమర్షియల్ పరిధి నుంచి ఇండస్ట్రియల్ పరిధిలోకి మార్చడంపై ముద్రణా సంస్థల నిర్వాహకులంతా హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆఫ్ సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ (టోపా) ఆధ్వర్యంలో బేగంపేట ది ప్లాజా హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోని ఆఫ్ సెట్ ప్రింటింగ్ ప్రెస్‌లకు మాత్రమే యూనిట్ విద్యుత్ ధర కమర్షియల్ టారిఫ్ కింద వసూలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఆఫ్ సెట్ ముద్రణాలయాల ఎలక్ట్రిసిటీ టారిఫ్‌ను కమర్షియల్ పరిధి నుంచి ఇండస్ట్రియల్ పరిధిలోకి మారుస్తూ తమకు అనుకూలంగా తీర్పు వెలువడింది అని ఆయన తెలిపారు. దీని మీద అపీలేట్ ట్రిబ్యునల్ ద్వారా ఏడేళ్లుగా తాము సాగించిన పోరాటం ఇప్పుడు సఫలీకృతం అయిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ తీర్పు వల్ల తెలంగాణలోని చిన్న, మధ్య తరహా ఆఫ్ సెట్ ముద్రణాలయాలకు ఎంతో లాభం చేకూరుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు సుధీర్ రెడ్డి, కర్ణాటక చిన్న, మధ్య తరహా పరిశ్రమల అసోసియేషన్ ప్రతినిధి ప్రభాకర్‌ను టోపా ప్రతినిధులు శాలువా, జ్ఞాపికతో సన్మానించారు.

కార్యక్రమంలో టోపా జాతీయ కన్వీనర్ శ్రీపతి దయాకర్‌రెడ్డి, టోపా ఉపాధ్యక్షుడు కరుణాకర్, ట్రెజరర్ రాధాకృష్ణ, ప్రింటింగ్ కాలేజీ విశ్రాంత అధ్యాపకుడు ధర్మవరపు నాగార్జున, పద్మశ్రీ అవార్డు గ్రహీత రైతునేస్తం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పక్షవాత అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

పక్షవాతానికి వైద్యం అందడం లేదు

● స్టార్ ఆస్పత్రి వైద్యులు

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పక్షవాత కారణంగా మనదేశంలో లక్షలాది మంది సమయానికి తగిన వైద్యసదుపాయాలు లభ్యంకాక, అనేక శారీరక, కుటుంబపరమైన ఇబ్బందులను ఎదుర్కోవటమే కాక, అకాల మరణాల బారీన పడుతున్నారని వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నం.10లోని స్టార్ ఆస్పత్రిలో బుధవారం 'స్టార్ కాంప్రెహెన్సివ్ స్ట్రోక్ కేర్ సెంటర్'కు అందుబాటులోకి తీసువచ్చారు. ఈ సందర్భంగా అవగాహన కార్యక్రమ నిర్వహించారు. వైద్యులు సహేర్, మున్వర్ అలీ, సుందీప్, అజయ్‌రెడ్డి, నిహారిక, విశ్వక్‌సేనరెడ్డి మాట్లాడారు. వైద్య సహాయం, విధివిధానాలు, తమ సూచనలు వివరించారు. వైద్యులు మాట్లాడుతూ పక్షవాత సమయంలో రోగులకు, వారి కుటుంబీకులకు తగిన చికిత్సనూ, మానసిక స్థైర్యాన్ని అందించవలసిన అవశ్యత ఉందన్నారు. పక్షవాతం అనే అనుమానం కలిగితే, మొదటి నాలుగు గంటలలోపు వైద్య సహాయం పొందటం, తర్వాత రోగచికిత్సకు చర్యలు తీసుకోవటం; అవసరమైన పక్షంలో శస్త్రచికిత్సలు చేయించుకోవటం ముఖ్యమన్నారు. పక్షవాత రోగ నిర్ధారణ, సత్వరంగా వేగవంతమైన చికిత్స రోగులకు సంపూర్ణ స్వస్థత చేకూర్చగల విధంగా అత్యాధునిక సదుపాయాలు అవసరమన్నారు. ఈ సందర్భంగా చికిత్సతో, పర్యవేక్షణలో పక్షవాత వ్యాధినుంచి సంపూర్ణంగా కోలుకుని, తిరిగి సాధారణ జీవనం గడుపుతున్న కొందరు వ్యాధి బాధితులు మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యులు దుష్యంత్, మహేశ్ రెడ్డి, నర్మద, ఇమ్రాన్‌ఖాన్, హరికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఖైరతాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు దివంగత కమ్మరి కృష్ణ వర్ధంతి సందర్భంగా ఖైరతాబాద్ రైల్వే గేటు కూడలిలో ఉన్న ఆయన విగ్రహం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఇందులో పెద్ద ఎత్తున పేదలు పాల్గొని కళ్లను పరీక్షింపజేసుకొని అవసరమైనవారికి మందులతో పాటు కళ్లద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా కమ్మరి కృష్ణ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులతో పాటు స్థానికులు పూల మాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఇందులో ఖైరతాబాద్ మాజీ కార్పొరేటర్ ఎస్‌కె షరీఫ్, సీనియర్ నేతలు, తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటీ చైర్మన్ మల్లు, మహేందర్‌బాబు, మహేష్ యాదవ్, శివ కుమార్, గంగాధర్ యాదవ్, కమ్మరి కృష్ణ కుమారుడు కమ్మరి వినయ్, సోదరుడు కమ్మరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం జరిగింది.

విద్యుత్ సంస్థల్లో నియామకాలు చేపట్టాలి

పంజాగుట్ట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్ సంస్థల్లో ఉద్యోగ, కార్మిక, సిబ్బందిని నియమించి పని భారం తగ్గించాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ 1535 యూనియన్ యూనియన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు ఎం.ఏ వజీర్ అన్నారు. బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో విద్యుత్ సౌధలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనియన్-2025 డైరీని యూనియన్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, టీజీఎస్పీడీసీఎల్ కర్ధం ప్రమోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి కీర్తి శ్రీనివాస్, ట్రాన్స్‌కో అధ్యక్షుడు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శినగేష్, ఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మూర్తిలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగ, కార్మిక, సిబ్బందికి 1999 ఫిబ్రవరి 1 తరువాత జాయిన్ అయిన వారికి ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ పెన్షన్ సౌకర్యం కల్పించాలని, తెలంగాణ విద్యుత్ సంస్థల్లో ఉద్యోగ, కార్మిక, సిబ్బందిని నియమించి పని భారం తగ్గించాలన్నారు. టీజీ జెన్కోలో కారుణ్య నియామకం క్రింద ఉద్యోగాల కోసం స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించిన వారికి ఉద్యోగ నియామకపు పత్రాలు వెంటనే ఇప్పించాలని అన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్స్‌ను సందర్శించిన ఎన్‌హెచ్ ఎస్ఆర్‌సీ ప్రతినిధుల బృందం

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నిమ్స్ ఆస్పత్రిని నేషనల్ హెల్త్ సిస్టం రిసోర్స్ సెంటర్ (ఎన్‌హెచ్ ఎస్ఆర్‌సీ) బృందం బుధవారం సందర్శించింది. నగరంలో నిర్వహిస్తున్న నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్‌పై నిర్వహించిన జాతీయ వర్క్‌షాపులో భాగంగా ప్రతినిధులు నిమ్స్ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా వారితో నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఎన్.బీరప్ప వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి నిమ్స్ ఆస్పత్రిలో ప్రస్తుతం ఉన్న రోగుల రద్దీ, ఓపీడీ, ఐపీడీ లెక్కల వివరాలను వారికి వివరించారు. నిమ్స్‌లో అందిస్తున్న వైద్య సేవలపై ఎన్‌హెచ్ఆర్‌సీ బృందం సంతృప్తి వ్యక్తం చేసిందని నిమ్స్ వైద్యులు తెలిపారు.

డిజిటల్ ఇన్నోవేషన్స్‌పై జాతీయ సదస్సు

ఖైరతాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కళలు, సామాజిక శాస్త్రం, పరిశోధన, సాంకేతికతలో డిజిటల్ ఆవిష్కరణలపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఐఐఎంసీ ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో వ్యక్తిగతంగా, వర్చువల్‌గా జరగనున్న ఈ సదస్సులో దేశంలోని ప్రఖ్యాత నిష్ణాతులతో ప్రసంగాలుంటాయని ఆయన తెలిపారు. ఈ సదస్సును చైర్మన్‌గా వ్యవహరించనున్న ప్రొఫెసర్ విశ్వనాథం ప్రారంభిస్తారని, సంప్రదాయ విద్యా విధానాలను పునర్నిర్మించడంలో డిజిటల్ ఆవిష్కరణల పాత్రపై ఆయన ప్రసంగించనున్నారన్నారు. ఇందులో దేశ వ్యాప్తంగా ఎంతో మంది పరిశోధనా పత్రాలను సమర్పించనున్నారని, డిజిటల్ ఆవిష్కరణల సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ సదస్సు ఉపకరిస్తుందని రఘువీర్ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11 కేవీ హైలం కాలనీ, పంజాగుట్ట, సాయిబాబా టెంపుల్, టెలిఫోన్ ఎక్స్ చేంజ్ ఫీడర్ల పరిధిలోని పోలీస్ లైన్స్ ఏరియా, వాటర్ ట్యాంకర్, గాయత్రీ హిల్స్, హైలం కాలనీ, ఫోకస్ బిల్డింగ్, కంటి ఆస్పత్రి, పంజాగుట్ట బాటా షోరూమ్, పంజాగుట్ట పీఎస్, సాయిబాబా టెంపుల్, టెలిఫోన్ ఎక్స్ంజ్, ద్వారకాపురి కాలనీ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 1 1 కేవీ ఎల్లారెడ్డిగూడ, బంజారాహిల్స్ స్టార్ ఆస్పత్రి, బాబుఖాన్ చాంబర్స్ ఫీడర్ల పరిధిలోని హనుమాన్ టెంపుల్, సంజయ్ గాంధీ నగర్, కృష్ణా అపార్ట్మెంట్, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10, కార్వీ భవనం, స్టార్ ఆస్పత్రి, బాబుఖాన్ చాంబర్స్, రేయిన్ బో ఆస్పత్రి, ఎస్బీఐ బ్యాంక్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో...

మరమ్మతుల కారణంగా గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్ సింగ్ తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పీసీబీ నియంత్రణ మండలి ఫీడర్ పరిధిలోని ఫతేనగర్ బ్రిడ్జి వెనుక ప్రాంతం, సనత్‌నగర్ బస్టాప్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.



ఖైరతాబాద్ గ్రంథాలయం కింది భాగంలో పేపర్లు చదువుతున్న రీడర్లు

గ్రంథాలయ భవనాన్ని ఆధునీకరిస్తాం

● చైర్మన్ ఉపేందర్‌రెడ్డి

ఖైరతాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోనే అతి సుందరమైన ఆకారంలో ఉన్న ఖైరతాబాద్ గ్రంథాలయాన్ని అన్ని విధాలుగా ఆధునీకరించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని నగర గ్రంథాలయాల సంస్థ చైర్మన్ ఆర్ ఉపేందర్ రెడ్డి, కార్యదర్శి పి.పద్మజలు తెలిపారు. గ్రంథాలయ నిర్వహణపై వచ్చిన పలు ఫిర్యాదులపై వారు ఖైరతాబాద్ వచ్చి గ్రంథాలయాన్ని పరిశీలించారు. వార్తా పత్రికలు మొదటి అంతస్తులోని వరండాలో చదువుతుండడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేసి గతంలో మాదిరిగానే గ్రౌండ్ ఫ్లోర్‌లోని హాల్‌కు తరలించాలనే ఆదేశాల మేరకు అక్కడకు తరలించారు. దీంతో పాఠకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు గ్రంథాలయం వెనకభాగంలో గోడలు పాతగా మారడంతో వాటికి ప్లాస్టింగ్ చేయించే పనులు ప్రారంభించారు. చైర్మన్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ అతి ప్రాచీన ఈ గ్రంథాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. పూర్తి భవనాన్ని గ్రంథాలయంగా వినియోగించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

శిశు సంరక్షణ కేంద్రాల్లో సర్టిఫికెట్ల ప్రదానం

ఖైరతాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పలు శిశు సంరక్షణ కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న పిల్లలకు ప్రభుత్వం గుర్తింపు పత్రాలను అందజేసింది. పాఠశాలలు, కళాశాలలతో పాటు ఉద్యోగాల కోసం విధిగా గుర్తింపు పత్రాలను చూపించాల్సిన అవసరం ఉండడంతో సంరక్షణ కేంద్రాల్లోని పిల్లలకు ఆధార్ కార్డులతో పాటు పుట్టిన తేదీ, నివాస, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో పాటు అవసరమైన వారికి సదరన్ సర్టిఫికెట్లను రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కార్పొరేటర్ విజయారెడ్డి, యునిసెఫ్ ప్రతినిధులతో కలిసి అందజేశారు. బుధవారం హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో 50 శిశు సంరక్షణ కేంద్రాల్లో ఉన్న 2300 మంది పిల్లలుండగా అందులో 1330 మందికి పలు ధ్రువీకరణ పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న 50 సంరక్షణ కేంద్రాల్లో ఆరింరటిని ప్రభుత్వం నడుపుతోందన్నారు. భవిష్యత్‌లో వీరి ఉపాధితో పాటు ఇతర రంగాల్లో సైతం ప్రభుత్వం సహకరిస్తుందన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య కదంబిని

పంజాగుట్ట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చింతల్ బస్తీలోని ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య, పరిపాలన విభాగాల ఆధ్వర్యంలో బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కదంబిని కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాజేంద్ర కుమార్ ప్రారంభించారు. విద్యార్థులు రకరకాల స్వీట్లు, సంప్రదాయ వంటకాలు, జొన్న రొట్టె, రాగి సంకటి, కట్లెట్, పానీ పూరి, రవ్వ లడ్డు, వెజ్ పలావ్, చికెన్ కర్రీ, కీర్, గాజర్ హల్వా, పులిహోర, పెరుగు పచ్చడి, గారెలు, మిర్చీలు, మజ్జిగ పులుసు, సున్నుండలు, భూరేలు, నాటుకోడి కర్రీ మొదలైన సాంప్రదాయ, ఆధునిక వంటకాలను తయారుచేసి 46 స్టాళ్లు ఏర్పాటు చేసి అమ్మకాలు జరిపారు. కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు వంటకాలను రుచి చూశారు. అత్యుత్తమ వంటకాలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభు, రంగశాయి పేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్,అధ్యాపకులు డాక్టర్ వి.రవీందర్ రెడ్డి,డాక్టర్ ప్రభాకర్, వైష్ణవి, సంధ్యా రాణి, డాక్టర్ గిరిధర్, కెప్టెన్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ క్వార్టర్స్ స్థానంలో 'డబుల్' ఇళ్లు నిర్మించండి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న బీజేపీ నేత నర్సింగ్‌రావు

అడ్డగుట్ట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌లో శిథిలావస్థలో ఉన్న మున్సిపల్ క్వార్టర్స్ స్థలంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బీజేపీ సీనియర్ నాయకుడు నర్సింగ్‌రావు బుధవారం వినతి పత్రం సమర్పించారు. 55 ఏళ్ల క్రితం నిర్మించిన మున్సిపల్ క్వార్టర్స్ కూలిపోయో ప్రమాదం ఉందని తెలిపారు. క్వార్టర్స్‌ను తొలగించి వీటి స్థానంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.



పద్మారావును కలిసిన సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

వెంకట్‌నగర్ బస్తీలో సమస్యలు పరిష్కరించండి

అడ్డగుట్ట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్ వెంకట్‌నగర్ బస్తీలో సమస్యలు పరిష్కరించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రంగనాయకులు కోరారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సయ్య, ప్రధాన కార్యదర్శి ఐలయ్య, కోశాధికారి శంకర్, సంయుక్త కార్యదర్శి రమేష్, వీరస్వామి, యాదగిరి, కృష్ణ, పి.యాదగిరి బుధవారం ఎమ్మెల్యే పద్మారావును కలిశారు. వెంకట్‌నగర్‌లో పవర్ బోర్ పాడైపోయి చాలా ఏళ్లు అవుతుందని, రోడ్లు కూడా సరిగ్గా లేవని, బస్తీలో సమస్యలు పరిష్కారించాలని ఎమ్మెల్యేను కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పవర్ బోర్‌కు మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారని రంగనాయకులు తెలిపారు.



డిజిటల్ అరెస్టుపై అవగాహన కల్పిస్తున్న రైల్వే సైబర్ క్రైమ్ డీఎస్పీ శ్రీనివాస్

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ డీపీగా పోలీస్ అధికారుల ఫొటో పెట్టుకుని సైబర్ మోసాలకు పాల్పడుతున్న అజ్ఞాత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని దక్షిణమధ్య రైల్వే సైబర్ క్రైమ్ డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. బుధవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ బుకింగ్ కౌంటర్ వద్ద ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అజ్ఞాత వ్యక్తుల ఫోన్‌లకు ఎవరూ బెదిరిపోకూడదని ఆయన తెలిపారు. వ్యక్తిగత, ఆర్థిక సమాచారం వారికి ఇవ్వొద్దని సూచించారు. ఇలాంటి ఫోన్ కాల్స్ వస్తే వెంటనే 1930 నంబరకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ మహేందర్ ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



కంటోన్మెంట్ ఐదో వార్డు సంజీవయ్య నగర్‌కు చెందిన శ్రీనివాస్ భార్య సదాలక్ష్మి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.44వేల చెక్కును వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పెద్దాల నరసింహ బుధవారం అందజేశారు.

- మారేడుపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి)

● ట్రాఫిక్ ఎస్సై ఉద్యోగ విరమణ



తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రామ్‌చందర్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్ మధు బాబు, ఎస్సై శ్రీకాంత్, బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్సై విజయ్‌కాంత్, బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్సై శ్రీధర్ రెడ్డి, తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు

- తిరుమలగిరి జనవరి 8 (ఆంధ్రజ్యోతి)

అక్రమ పదోన్నతులను సమీక్షించాలి

● విద్యుత్ బీసీ ఉద్యోగుల మహాసభ డిమాండ్

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో అక్రమ పదోన్నతులను సమీక్షించాలని విద్యుత్ బీసీ ఉద్యోగుల మహాసభ డిమాండ్ చేసింది. విద్యుత్ సంస్థల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో బుధవారం ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థల్లో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులతో 19వ రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభలో సంఘం నేతలు పలు డిమాండ్లను తీర్మానించింది. రాష్ట్ర అధ్యక్షుడు కోడెపాక కుమారస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్నగౌడ్‌లు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యాజమాన్యాలు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉద్యోగుల కేటాయింపులకు సంబంధించి సుప్రీంకోర్టు ధిక్కరణ కేసును సాకుగా చూపి 2022లో వందలాది మంది ఉద్యోగులకు షరతులతో కూడిన పదోన్నతులు కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పదోన్నతులను సమీక్షించి నష్టపోయిన బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

'విద్యుత్ సంస్థల్లో నియామకాలు చేపట్టాలి'

పంజాగుట్ట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్ సంస్థల్లో ఉద్యోగ, కార్మిక, సిబ్బందిని నియమించి పని భారం తగ్గించాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ 1535 యూనియన్ యూనియన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు ఎం.ఏ వజీర్ అన్నారు. బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో విద్యుత్ సౌధలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనియన్-2025 డైరీని యూనియన్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, టీజీఎస్పీడీసీఎల్ కర్లం ప్రమోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి కీర్తి శ్రీనివాస్, ట్రాన్స్‌కో అధ్యక్షుడు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శినగేష్, ఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మూర్తిలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగ, కార్మిక, సిబ్బందికి 1999 ఫిబ్రవరి 1 తరువాత జాయిన్ అయిన వారికి ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ పెన్షన్ సౌకర్యం కల్పించాలని, తెలంగాణ విద్యుత్ సంస్థల్లో ఉద్యోగ, కార్మిక, సిబ్బందిని నియమించి పని భారం తగ్గించాలన్నారు. టీజీ జెన్కోలో కారుణ్య నియామకం క్రింద ఉద్యోగాల కోసం స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించిన వారికి ఉద్యోగ నియామకపు పత్రాలు వెంటనే ఇప్పించాలని అన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వైకుంఠ ఏకాదశి

● నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ముస్తాబు
● ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు
● ఆలయానికి 60 అడుగుల డిజిటల్ లైటింగ్
● కిలో మీటర్ మేర విద్యుత్ దీపాలు, స్వాగత ద్వారాలు

బౌద్ధనగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రముఖ ఆలయాల్లో ఒకటైన సికింద్రాబాద్ నియోజకవర్గంలోని సీతాఫల్‌మండి నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సర్వాంగా సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఈనెల 10, 11 తేదీల్లో వైకుంఠ ఏకాదశి, ద్వాదశిని అంగరంగవైభవంగా నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేకంగా బంగారుచాయతో ఏర్పాటుచేసిన ఉత్తరద్వారం ద్వారా భక్తులు దర్శనం చేసుకునే విధంగా ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

ప్రత్యేక అలంకరణలో..

నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఏడు ఉత్తరద్వారాలు దాటిన తర్వాత వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన భారీ వేంకటేశ్వర స్వామి విగ్రహం భక్తులకు దర్శనం ఇవ్వనుంది. అనంతరం ఆలయంలోని మూలవిరాట్ కల్యాణ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. తిరుమల ఆకారంతో పాటు 60 అడుగుల డిజిటల్ గోపురాన్ని నూతనంగా ఏర్పాటు చేయటంతో పాటు ఈ ఆలయాన్ని బంగారుచాయతో తీర్చిదిద్దారు.



ఆలయం వద్ద ఏర్పాటుచేసిన విద్యుత్‌దీపాలు

ఆలయ చరిత్ర...

2011వ సంవత్సరంలో నామాలగుండు చౌరస్తాలో గుండు (పెద్దరాయి) ఖాళీగా ఉన్న స్థలంలో ప్రస్తుత ఆలయ చైర్మన్ నోముల ఇందిరా ప్రకాశరావు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. మహాబలేశ్వరంలో నల్లరాతిపై చెక్కించిన కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి విగ్రహాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణలు, హోమాలు నిర్వహించి ప్రతిష్ఠించారు. భక్తులు కోరికలు నేరవేరటంతో అతితక్కువ సమయంలో ఈ ఆలయం నగరంలో పేరుప్రఖ్యాత్యలు గాంచింది.



కల్యాణ వేంకటేశ్వరస్వామి మూలవిరాట్



విద్యుత్‌కాంతులతో నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం

వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ఆహ్వానం

నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 10న జరిగే వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో పాల్గొనాలని పలువురిని ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు బుధవారం కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమతో పాటు పలువురు కార్పొరేటర్లు, వివిధ పార్టీ నాయకులను కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజేశ్, నాగులూరి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశిని ఘనంగా నిర్వహిస్తాం



నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 10, 11 తేదీల్లో వైకుంఠ ఏకాదశిని అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం. శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటలకు సుప్రభాత సేవతో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 5గంటల నుంచి కల్యాణ వేంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకం, అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ప్రారంభమవుతుంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఉత్తర ద్వారం ద్వారా స్వామివారి దర్శించుకోవాలి. ఈ వేడుకలకు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు తీగుళ్ల పద్మారావుగౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ ముఖ్యఅతిథులు పాల్గొంటారు.

- నోముల ప్రకాశరావు, ఆలయ చైర్మన్

మేకలమండి పాఠశాలను అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



అధికారులతో కలిసి తరగతి గదులను పరిశీలిస్తున్న తలసాని

పద్మారావునగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రానున్న విద్యా సంవత్సరం నుంచి మేకలమండి ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాల(హైస్కూల్)గా అప్‌గ్రేడ్ చేయటానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీ ఇచ్చారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని మేకలమండి పాఠశాల అభివృద్ధిలో భాగంగా రూ.1.80 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదుల భవనాన్ని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. జీప్లస్-2 విధానంలో 16 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టగా, పనులు తుదిదశకు చేరుకొన్నాయని అధికారులు తలసానికి తెలిపారు. ప్రస్తుతం 7వ తరగతి వరకు 614 మంది విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారని, ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని, అదనంగా 6 తరగతి గదులు మంజూరు చేయించాలని పాఠశాల డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. పిల్లల బంగారు భవిష్యత్‌కు విద్య ప్రధానమని, దాని కోసం స్కూల్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నానని తెలిపారు. పాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణికి ఎమ్మెల్యే సూచించారు. పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న స్కూల్ డెవలప్‌మెంట్ సభ్యులను, మాజీ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, డీఈఓ రోహిణి, డిప్యూటీ ఈఓ శ్రీధర్, డిప్యూటీ ఐఓఎస్ కస్తూరి, ఈఈ(టీఎస్ఈడబ్ల్యూఐడీసీ) షఫీ, డీసీ సమ్మయ్య, ప్రధానోపాధ్యాయులు స్వరూప, డెవలప్‌మెంట్ సభ్యులు చంద్రశేఖర్, నర్సింగరావు, శేషగిరిరావు, రాజు, భరత్‌భూషణ్, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు పవన్‌కుమార్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశన్‌రాజు, మహేశ్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల ఇరుముడి పూజలో..

రెజిమెంటల్‌బజార్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వాముల ఇరుముడి పూజలో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. బుధవారం మోండా డివిజన్ ఆదయ్యనగర్ 18 టెంపుల్స్, నల్లపోచమ్మ ఆలయాలలో 65 మంది అయ్యప్ప మాలధారులు ఇరుముడి పూజ అనంతరం శబరిమల అయ్యప్ప దర్శనానికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, స్కైలాబ్ యాదవ్, నాగులు, హరికృష్ణ, మహేష్, మహేందర్, జయరాజ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో తెలంగాణ ఆఫ్ సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ కార్యవర్గసభ్యులు

విద్యుత్ చార్జీల టారిఫ్ మార్పుపై హర్షం

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆఫ్ సెట్ ప్రింటింగ్ ప్రెస్‌ల ఎలక్ట్రిసిటీ టారిఫ్‌ను కమర్షియల్ పరిధి నుంచి ఇండస్ట్రియల్ పరిధిలోకి మార్చడంపై ముద్రణా సంస్థల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆఫ్ సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ (టోపా) ఆధ్వర్యంలో బేగంపేట ది ప్లాజా హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ... కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోని ఆఫ్ సెట్ ప్రింటింగ్ ప్రెస్‌లకు మాత్రమే యూనిట్ విద్యుత్ ధర కమర్షియల్ టారిఫ్ కింద వసూలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఆఫ్ సెట్ ముద్రణాలయాల ఎలక్ట్రిసిటీ టారిఫ్‌ను కమర్షియల్ పరిధి నుంచి ఇండస్ట్రియల్ పరిధిలోకి మారుస్తూ తమకు అనుకూలంగా తీర్పు వెలువడింది అని ఆయన తెలిపారు. దీని మీద అపీలెట్ ట్రిబ్యునల్ ద్వారా ఏడేళ్లుగా తాము సాగించిన పోరాటం ఇప్పుడు సఫలీకృతం అయిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ తీర్పు వల్ల తెలంగాణలోని చిన్న, మధ్య తరహా ఆఫ్ సెట్ ముద్రణాలయాలకు ఎంతో లాభం చేకూరుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు సుధీర్ రెడ్డి, కర్ణాటక చిన్న, మధ్య తరహా పరిశ్రమల అసోసియేషన్ ప్రతినిధి ప్రభాకర్‌ను టోపా ప్రతినిధులు శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టోపా జాతీయ కన్వీనర్ శ్రీపతి దయాకర్‌రెడ్డి, టోపా ఉపాధ్యక్షుడు కరుణాకర్, ట్రెజరర్ రాధాకృష్ణ, ప్రింటింగ్ కాలేజీ విశ్రాంత అధ్యాపకుడు ధర్మవరపు నాగార్జున, పద్మశ్రీ అవార్డు గ్రహీత రైతునేస్తం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చిలకలగూడ పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

రమేష్ బిదూరీ దిష్టిబొమ్మ దహనం

బౌద్ధనగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రియాంక గాంధీపై బీజేపీ మాజీ ఎంపీ రమేశ్ బిదూరీ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ.. కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. రాజ్యసభ సభ్యుడు, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్ పిలుపు మేరకు బుధవారం సికింద్రాబాద్ నియోజకవర్గ ఏ, బీ బ్లాక్ అధ్యక్షులు ఆర్.జగదీశ్వరరావు, ఎన్.సురేష్‌లాల్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకుని సీతాఫల్‌మండిలో నిరసన తెలిపి, రమేశ్ బిదూరీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా చిలకలగూడ పోలీసులు కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించగా అక్కడ మరోసారి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి, జహంగీర్, రాజేశ్వర్, ఇమ్రోజ్, కరీమ్, జగదీష్, అనంత్, సాయిబాబా, రాజు, చక్రం తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారాలను తొలగించం

● ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య

బేగంపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా వ్యాపారులు చేసుకోవాలని బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య అన్నారు. బేగంపేట ఫ్లైఓవర్ క్రింద ఉన్న చిరు వ్యాపారాలు తొలగించాలని ట్రాఫిక్ పోలీసులు చెప్పడంతో స్థానికులు విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలిమ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె ఆదేశాల మేరకు ట్రాఫిక్ అధికారులతో కలిసి కాంగ్రెస్ నేత అడపా అభిషేక్ ఈ ప్రాంతంలో పర్యటించి వారికి బరోసా ఇచ్చారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్యతో కలిసి చిరు వ్యాపారులను కలిసి మాట్లాడారు. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా, రోడ్డుపైకి రాకుండా వ్యాపారాలు చేసుకోవాలని, రోడ్డుపై వేసిన రేకులను తొలగించాలని చిరు వ్యాపారులకు సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేని వాటిని తొలగించబోమని ఈ సందర్భంగా వారికి తెలిపారు. కాంగ్రెస్ నేత అడపా అభిషేక్ మాట్లాడుతూ పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బస్తీలో ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారాలను తొలగించ వద్దని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌ను కోరగా ఆయన అందుకు సానుకూలంగా స్పందించారన్నారు. కాంగ్రెస్ నేతలు మునీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య

ఇళ్ల సర్వేలో డబ్బులు అడిగితే మా దృష్టికి తీసుకురావాలి

● డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య

బేగంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య సూచించారు. బుధవారం బేగంపేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ఇళ్లకు వెళ్లి సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్‌లో ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 26,049 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు 14,300 ఇళ్ల సర్వే పూర్తయిందన్నారు. ప్రతి ఒక్క ఇంటికి వచ్చి సిబ్బంది సర్వే చేస్తున్నారన్నారు. ఇళ్ల సర్వేకు వచ్చిన వారు ఎవరైనా డబ్బులు అడిగితే మా దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

10న వైకుంఠ ఏకాదశి, 13న గోదా కల్యాణం

రెజిమెంటల్‌బజార్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్‌లో ఉన్న శ్రీ పాండురంగ విఠలేశ్వర వేంకటాద్రి స్వామి దేవాలయంలో ఈనెల 10న వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో సత్యనారాయణ తెలిపారు. వైకుంఠ ఏకాదశి రోజున ఉదయం 5గంటల నుంచి ఉత్తర ద్వారా దర్శనం, ప్రత్యేక తులసి అర్చనలు అలాగే 13న గోదా కల్యాణం జరుగుతాయని తెలిపారు.



ఎమ్మెల్యే తలసానిని ఆహ్వానిస్తున్న హనుమాన్ టెంపుల్ ఈవో శ్రీనివాస శర్మ తదితరులు

వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు తలసానికి ఆహ్వానం

రెజిమెంటల్‌బజార్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఎస్పీ రోడ్డులోని హనుమాన్ టెంపుల్‌లో ఈ నెల 10 వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాస శర్మ తెలిపారు. ఈ వేడుకలలో పాల్గొనాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ప్రధాన అర్చకులు బద్రినాదచార్యులు, మాజీ ధర్మకర్తలతో కలిసి ఆలయ ఈవో ఆహ్వానించారు.

రాంగోపాల్‌పేట్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాంగోపాల్‌పేట్ డివిజన్ పాన్ బజార్‌లో గల వేణుగోపాల స్వామి దేవాలయంలో ఈనెల 10న జరుగనున్న వైకుఠ ఏకాదశి ఉత్సవాలలో పాల్గొనాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆలయ కార్యనిర్వాహణాధికారి రవికాంత్ కర్నే ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ బొల్లు శ్రీనివాస్, మాజీ ధర్మకర్తలు ముత్యాల సాయిబాబ, దర్శనం శివకుమార్, ఉప్పు రామ్మోహన్ తదితరులు ఉన్నారు.



హెల్మెట్ ధరించాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులకు సూచిస్తున్న ఎర్రస్వామి

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి : ఆర్టీఓ

తిరుమలగిరి జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా నియమాలను తప్పక పాటించాలని తిరుమలగిరి ఆర్టీఓ ఎర్రస్వామి విద్యార్థులు వారి తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం జాతీయ రహదారి భద్రతా మసోత్సవాలు పురస్కరించుకొని తిరుమలగిరి లాల్‌బజార్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మైనర్లు వాహనాన్ని నడపడానికి అనర్హులని పేర్కొన్నారు. మద్యం తాగి, అతివేగంగా వాహనాలను నడపరాదని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చాలా ప్రమాదకరమని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు నరసింహస్వామి, నేహ, అవినాష్ నాయక్, లావణ్య, ట్రైనింగ్, సహాయ మోటర్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

'గృహజ్యోతి, మహాలక్ష్మి' దరఖాస్తుల వెల్లువ

బోయిన్‌పల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు దరఖాస్తులు చేసుకునేందుకు జనం బారులుదీరారు. మూడు రోజులుగా ప్రజలు తహసీల్దార్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున దరఖాస్తులతో బారులుదీరుతున్నారు. ఈ సందర్భంగా తిరుమలగిరి తహసీల్దార్ అశోక్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన వారి నుంచి గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు సంబంధించిన దరఖాస్తులు మాత్రమే తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటివరకు గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు సంబంధించిన 1180 దరఖాస్తులు అప్‌డేట్ చేసినట్లు ఆయన తెలిపారు.

వివాహిత అదృశ్యం



రుబీనాబేగం

బోయిన్‌పల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మూడు నెలల క్రితం వివాహమైన మహిళ అదృశ్యమైన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి పెన్షన్ లైన్‌లో నివాసం ఉంటున్న పర్వీన్‌బేగం చిన్నకూతురు రుబీనాబేగంకు మూడు నెలల క్రితం కర్నూల్‌కు చెందిన ఫయాజ్ బాషాతో వివాహం అయ్యింది. గత నెల 27న కర్నూల్ నుంచి భార్యాభర్తలు బోయిన్‌పల్లికి వచ్చారు. ఈనెల 2న రాత్రి ఇద్దరు బోయిన్‌పల్లిలో పర్వీన్‌బేగం ఇంటి వద్దే ఉన్నారు. మధ్యరాత్రి ఫయాజ్ బాషా లేచి చూడగా రుబీనాబేగం కనిపించలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబసభ్యులు బుధవారం బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు రుబీనాబేగం తనతో పాటు తనకు సంబంధించిన వస్తువులు, బంగారం తీసుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.